సామాన్యుడి ఆయుధం
# తెలంగాణ ప్రభ
శుక్రవారం, జూన్ 28, 2024
డిజిటల్





# అంతా మా ఇష్టం

## అనుమతి లేకున్నా భవనాలు నిర్మిస్తాం



- మాకు అధికారుల అండదండలు పుష్కలం
- గాజుల రామారం సర్కిల్లో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే

గాజుల రామారం సర్కిల్ మహదేవపురం, కైలాస్ హిల్స్, షిరిడి హిల్స్, ప్రగాటూల్స్, దేవేందర్ నగర్ కాలనీలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే కనిపిస్తాయి. ఎలాంటి అనుమతులు లేకుండా మేము మొనార్కులం అనే విధంగా నిర్మాణాలు చేపడుతుంటే అధికారులకు కనబడడం లేదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు మాత్రం మాకు ఏమీ పట్టనట్టుగా నోటీసులు ఇచ్చి సరిపెట్టుకుంటున్నారు. పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపడుతున్న అధికారులు మాత్రం అటువైపు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ, తమ గల్లా నింపుకుంటున్నారని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్)

సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ

WANTED

సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయ గలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి
'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక'
ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి
సెల్: 99854 44342



## కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రం

**తెలంగాణ ప్రభ,(తంగళ్ళపల్లి) :** తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్లో సీ.సీ.టీ.ఎన్.ఎస్ రైటర్ గా పనిచేస్తున్న కానిస్టేబుల్ నాగరాజు కు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం సిరిసిల్ల లో ఎస్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రశంస పత్రం అందించడం జరిగింది. తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్లో తన వర్టికల్ లో ఉత్తమ పనితీరును ప్రదర్శించిన కానిస్టేబుల్ నాగరాజును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## గుమ్మడి ఆశ్రమాన్ని సందర్శించిన సివిల్ జడ్జి

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల పరిధిలోని ఎక్లాస్‌పూర్ క్యాంప్‌లో గుమ్మడి బాలుర ఆశ్రమాన్ని జిల్లా న్యాయ సేవధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి సందర్శించారు. ఆశ్రమంలోని పిల్లల సమస్యలను, పరిసరాలను గదులను పరిశీలిస్తూ, ఆశ్రమ సిబ్బందితో పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లల చదువు పట్ల వారి జ్ఞానాన్ని, క్రమశిక్షణను అడిగి తెలుసుకున్నారు. ఆమె పిల్లలతో మాట్లాడుతూ శ్రద్ధగా పాఠశాలకు వెళుతూ ఉన్నతమైన విద్యను చదివి జీవితంలో స్థిరపడుతూ,గుమ్మడి ఫౌండేషన్ పేరు నిలబెట్టాలని విద్యార్థులకు సూచించారు. ఆమె వెంట గుమ్మడి ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుమ్మడి శ్రీధర్ సుచిత్ర, గుమ్మడి ఫౌండేషన్ మేనేజర్ నీరడి మధు, డీఎల్ఎస్ఏ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## కోరుట్ల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి ఈరోజు ఉదయం పూట జరిగే పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ తిరుపతి జవాన్లకు, ఆటో డ్రైవర్లకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రతిరోజు చెత్త సేకరణ మరియు మురికి కాలువలను శుభ్రం చేయడం గురించి పలు సూచనలు చేయడం జరిగింది. వర్షాకాలం దృష్ట్యా అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి తో పాటు సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్ పాల్గొన్నారు.

# బాచుపల్లి ఫ్లైఓవర్ పనులను పూర్తిచేయాలి

### ఎమ్మెల్యే కేపీ.వివేకానంద



**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** కొంపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని బాచుపల్లి ఫ్లైఓవర్, బాచుపల్లి – బౌరంపేట్, బహదూర్ పల్లి – కొంపల్లి రోడ్డు విస్తరణ పనులపై హెచ్ఎండిఏ, వాటర్ వర్క్స్, అటవీ, రెవెన్యూ, మున్సిపల్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 3.97 కోట్ల రూపాయలతో శంకుస్థాపన జరిగి నేటికీ పూర్తి కానీ బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా బాచుపల్లి నుంచి మల్లంపేట వరకు 1.64 కోట్ల రూపాయలతో 1.20 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను, మల్లంపేట్ నుంచి బౌరంపేట వరకు 2.07 కోట్ల రూపాయలతో సుమారు 4.80 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు, గండి మైసమ్మ నుంచి బహదూర్ పల్లి వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనుల్లో ట్రాన్స్ఫార్మర్ల షిఫ్టింగ్, కరెంటు పోల్ షిఫ్టింగ్ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. దీంతోపాటు మియాపూర్ నుంచి గండి మైసమ్మ వరకు కల 13.3 కిలోమీటర్ల రోడ్డు విస్తరణలో భాగంగా 1.50 కిలోమీటర్లు, కొంపల్లి – బహదూర్ పల్లి 7 కిలోమీటర్ల మార్గంలో సుమారు 5.74 కోట్ల రూపాయలతో చేపట్టనున్న రోడ్డు వేస్తున్న పనుల్లో గల 2.8 కిలోమీటర్ల అటవీ శాఖ భూములకు అనుమతి తీసుకోని రోడ్డు విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ, కొంపల్లి కమిషనర్ శ్రీహరి, ఎమ్మార్వో మతిన్, హెచ్ఎండిఏ అధికారులు యూసుఫ్ హుస్సేన్, అప్పారావు, హరికృష్ణ, వేణుగోపాలరావు, రమేష్ బాబు లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

### మండల విస్తరణ అధికారి గోవర్ధన్

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను మండల ఆరోగ్య విస్తీర్ణ అధికారి గోవర్ధన్ వారి సిబ్బందితో కలిసి ఆకస్మాత్తుగా సందర్శించారు. పాఠశాలలలోని పరిసరాలను పరిశుభ్రతను, పాఠశాల బిల్డింగ్ పైన ఉన్న నీటి నిల్వలను, త్రాగునీరు ట్యాంకులను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయునిలతో మాట్లాడుతూ... వర్షాకాలం ఉన్నందున ఈగలు దోమలు ద్వారా వచ్చే వ్యాధుల పట్ల విద్యార్థినిలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి వారానికి ఒకసారి ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటిస్తూ, దోమల ద్వారా వ్యాప్తి చెందే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినిలు వ్యక్తిగత పరిశుభ్రత తప్పకుండా పాటించాలని సూచించారు. అన్నం తినే ముందు చేతులను శుభ్రపరుచుకోవాలన్నారు. దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆతిసార వ్యాధి పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జ్యోతి, ఆరోగ్య సిబ్బంది రోజా శ్రీదేవి, ఆశ వర్కర్ల అనిత, సంగీత, అక్తరి, కేజీబీవీ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దైవచింతనతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద
- సారెగూడెంలోని బంగారు మైసమ్మతల్లి ఆలయ 5వ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్)** : దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని సారెగూడెంలోని బంగారు మైసమ్మ తల్లి ఆలయ 5వ వార్షికోత్సవ బోనాల పండుగ జాతరలో ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని ప్రజలు సుఖ సంతోషాలతో ఆరోగ్యాలతో ఉండేలా చూడాలని వేడుకున్నానని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, సాయి యాదవ్, బౌరంపేట్ పాక్స్ చైర్మన్ మిద్దుల బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ వార్డు సభ్యులు శ్రీశైలం, వీరాస్వామి, నాగార్జున, రామ్‌బాబు, పాక్స్ డైరెక్టర్లు వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు మచ్చేందర్, అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## మాదిగ జర్నలిస్టు ఫోరం మేడ్చల్ జిల్లా కన్వీనర్‌గా జోగు వెంకట్

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ గా కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన జోగు వెంకట్ నియామకం అయ్యారు. బుధవారం కంటోన్మెంట్లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎండబ్ల్యూజేఎఫ్ జాతీయ ఇంచార్జీ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ సుంచు అశోక్ మాదిగ ఎండబ్ల్యూజేయు రాష్ట్ర ఇన్ ఛార్జ్ సుంచు అశోక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గాదె రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జూలై 7న వరంగల్ లో జరిగే 'మాదిగల కవాతు'ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జోగు వెంకట్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపుమేరకు ఏబిసిడి వర్గీకరణ ఉద్యమంలో క్రియాశీలకంగా భాగస్వామ్యంతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని, తన నియామకానికి సహకరించిన సంఘం జాతీయ రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రతినిధులు ఎర్ర యాకన్న, సి దశరథ్ మహంకాళి భిక్షపతి, బూడిద నరేందర్ రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.






# అధ్యయనం కోసం సిరిసిల్ల పారిశ్రామికవేత్తలు





తెలంగాణ ప్రభ (సిరిసిల్ల) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలలో యువ పారిశ్రామిక విధులకు అరుదైన అవకాశం లభించింది. వైఈఎస్ (యంగ్ ఎంటర్ ప్రైజెస్ ఆఫ్ సిరిసిల్ల) పేరుతో క్వాలిటీ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ ఉత్పత్తులు, ఆధునిక యంత్రాల నిర్వహణపై అధ్యయనం చేయడం కోసం టెక్స్ టైల్ శాఖ వీరికి అరుదైన అవకాశాన్ని కల్పించింది. తిరువూరులోని టెక్స్ టైల్స్ ఎక్స్‌పోర్ట్ అసోసియేషన్‌తో కలిసి నూతనంగా అమలు చేయడానికి సాధ్యమయ్యే ఉత్పత్తులపై చర్చించడం కోసం మార్కెటింగ్ అవకాశాలపై బృందం సభ్యులు చర్చించే అవకాశం కల్పించారు. బృందంలో రిక్కుమల్లె బాల వేణుగోపాలకృష్ణ, మంచే అఖిల్, మ్యన వేణుగోపాల్, గోవింద్ శ్రీకాంత్, సామల భానుచందర్, తాటిపాముల సాయికిరణ్, వేముల రాజశేఖర్, రిక్కుమల్లె బాల శివరామకృష్ణ, గడ్డం ప్రభాకర్, గాజుల ప్రవీణ్, దుబాల అనిల్ కుమార్, దూస వంశీకృష్ణ, వేముల ప్రవీణ్, కుంటుకు సతీష్, దూడం శ్రీకాంత్, ఆడెపు వినయ్, ఉడుత రాజశేఖర్, శ్రీరామ్ మహంతి, వెల్లండి వంశీకృష్ణ, పీనగాని సతీష్, మార్గం సంతోష్, భరత్, వెంకటసాయి, గాజుల సాయికృష్ణ అధ్యయనం కోసం వెళ్లే యువ పారిశ్రామిక వేత్తలు బృందంలో ఉన్నారు.













# రేపాక.. ఊరు చుట్టూ చారిత్రక సంపద

- తెలుగు కన్నడ భాషలో అరుదైన శాసనం
- మూడవ హరి కేసరి ప్రత్యేకముద్ర
- ప్రాచీన శిలా సంపద -ఎనిమిదవ శతాబ్దం నుంచి ఇప్పటిదాకా అనేక ఆనవాళ్లు

**అల్లే రమేష్, జర్నలిస్ట్ సిరిసిల్ల**





తెలుగు ప్రాచీనతను పట్టిచూపుతున్న బొమ్మలమ్మ గుట్టపై చెక్కిన శిల్పాల గురించి తెలిసిందే. అదే కాలానికి సంబంధించి కన్నడ తెలుగులో చెక్కిన శాసనం ఒకటి రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలో వెలుగు చూసింది. చరిత్ర పొడుగునా రాచరికపు ఆనవాళ్లనే కాకుండా ప్రజల సాంస్కృతిక జీవనంలో భాగమైన ఎన్నో అంశాలను రేపాక పదిలంగా దాచింది. వేములవాడ చాళుక్యుల ఏలు బడిలో మూడవ అరికేసరి పాలనలో ఈ ప్రాంతం ప్రత్యేకతను సంతరించుకుందని ఆధారాలు అనేకం గ్రామంలో లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల సమీపంలోని విరిగిపోయిన శాసనం పై మూడవ అరికేసరి వేయించిన శిలా శాసనం ప్రత్యేకమైనది చెప్పాలి. క్రీస్తు శకం 968లో రెండు పక్కల కన్నడ రెండు పక్కల తెలుగు భాషలో రాయబడ్డ శాసనం భద్రత లేకుండా పడి ఉంది. ఇక్కడ కొద్ది దూరంలో రోడ్డుపైన ప్రాచనమైన వినాయక శిల్పం ఒకటి ఉంది. అప్పట్లో జైన ఆలయం కూడా మూడవ హరికేసరి నిర్మించినట్లు శాసనంలో ఉంది. ప్రస్తుతానికి ఆలయం ఆనవాళ్లు ఉనికిలో లేవు.


చాళుక్యుల నిర్మాణ శైలి పోలిన మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉంది. ఆలయం పూర్తిగా శిధిలావస్థలో ఉన్నది. ఆలయం ముందు వేములవాడ భీమేశ్వర ఆలయంలోని వల్లు బండ లాగే కోన యంత్రం ఉంటుంది. గ్రామస్తులకు ఇప్పటికీ ఏలాంటి ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చిన ఇక్కడికి వచ్చి పసుపు కుంకుమలతో పూజలు చేస్తారని గ్రామస్తులు తెలిపారు. కోట గడ్డ ప్రాంతంలో అనేక అన్నవాళ్లు మట్టి పొరలలో కూరుకుపోయిన శివలింగం తాలూకు పానపట్టం ఒకటి కనిపించింది. ఇక్కడే లోహ శుద్ధి కేంద్రం ఆనవాళ్లు కనిపించాయి.

చౌడమ్మ గుండుగా ప్రాచుర్యంలో ఉన్న అరుదైన శిల్పం ఒకటి గ్రామంలో కనిపిస్తుంది. పదో శతాబ్దానికి చెందిన మృగయా వినోద శిల్పంగా కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీ రామోజీ హరగోపాల్ తెలిపారు. అనంతర కాలానికి సంబంధించిన ఎంతో చారిత్రక శిల్ప సంపద గ్రామంలో కనిపిస్తుంది.

రేపాక కిష్టాపూర్ రహదారిలో గ్రామ శివారులో బయ్యన్న విగ్రహం కనిపిస్తోంది. ఇవేకాక అనేక శిల్పాలు గ్రామంలో కనిపిస్తాయి. మంగళగిరి ఆలయ సమీపంలోని బావి ఇప్పటికి చెక్కుచెదరకుండా ఉన్నది. ఇక్కడ సగం విరిగిపోయి నిలబెట్టబడ్డ శాసనమొకటి ఆలయం ముందు కనిపించింది.అనేక అంశాలను "మన గ్రామం మన చరిత్ర" రచన ద్వారా బల్ల సతీష్ కుమార్ అనేక అంశాలను పొందుపరిచి ఉన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం లోని జిల్లా సరిహద్దు చివరి గ్రామమైన రేపాక చుట్టూ అల్లుకున్న ఎంతో చరిత్ర కనుమరుగు కాకుండా కనీసం ఇప్పటికైనా గ్రామంలోని శిలాశాసనాలను భద్రపరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తొమ్మిదవ శతాబ్దం నుండి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం దాకా రేపాక గ్రామానికి ప్రత్యేక స్థానం ఉన్నది. ఇప్పటికీ గ్రామంలోని శిధిలావస్థలో ఉన్న "గడి" ఒకనాటి నియంతృత్వాన్ని ఇంకా గుర్తు చేస్తున్నట్లు అనిపిస్తుంది. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో తొలి ఎన్కౌంటర్ గా చరిత్ర ఎక్కిన మహమ్మదాపూర్ ఎన్కౌంటర్లో రొండ్ల మాధవరెడ్డి నిజం రజాకర్ మూకలకు ఎదురొడ్డి ప్రాణాలు తృణ పాయంగా అర్పించాడు. కాకతీయుల కాలంనాటి గొలుసుకట్టు చెరువుల నుంచి మొదలుకొని కాలానుగుణంగా వస్తున్న మార్పులను ప్రతిబింబిస్తూ ఇక్కడ వ్యవసాయ బావులు ప్రత్యేకంగా ఇప్పటికీ వాడకంలో ఉన్నాయి. గ్రామంలో జానపద కళాకారులు తరతరాలుగా ఇప్పటికీ గత చారిత్రక సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించడం చూడవచ్చు.

**కథనం కోసం సహకారం అందించిన ఆత్మీయులు రేపాక గ్రామస్తులు రేణుక, వేములవాడ హరీష్ కుమార్, రొండ్ల మధుసూదన్ రెడ్డి, యాస రాజులకు ప్రత్యేక కృతజ్ఞతలు.**





# హమ్మయ్యా బతికించావ్..

# పూనమ్

ఒకప్పటి హీరోయిన్ పూనమ్ బజ్వా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అల్లు అర్జున్ 'పరుగు', నాగార్జున 'బాస్' వంటి చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఇక ఈ అమ్మడు తెలుగు, తమిళ, మలయాళ భాషా చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది. కానీ పెద్దగా ఫేమ్ రాకపోవడంతో పాటు సినిమా ఆఫర్లు కూడా రాలేదు. దీంతో కొద్ది కాలంగా సినిమాలకు దూరంగా ఉంటుంది. కానీ సోషల్ మీడియాలో నిత్యం యాక్టీవ్‌గా ఉంటూ తన హాట్ ఫొటోలతో కుర్రకారు మతి పోగొడుతూ ఫుల్ క్రేజ్ సంపాదించుకుంది. రోజురోజుకూ గ్లామర్ డోస్ పెంచి బాయ్స్‌కి నిద్రలేకుండా చేస్తుంది. తాజాగా పూనమ్ బజ్వా సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో బ్లూ కలర్ శారీ కట్టుకొని వయ్యారంగా చూస్తూ ఫొటోలకి స్టిల్స్ ఇచ్చింది. అది చూసిన నెటిజన్లు 'హమ్మయ్యా చీర కట్టుకొని బతికించావ్.. చాలా రోజులుగా గ్లామర్ డోస్‌తో ఉక్కిరి బిక్కిరి అయిన మాకు ఇన్నిరోజులకు కొంచెం గ్యాప్ ఇచ్చావ్' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పిక్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



